సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 28 । మే । 2024



కొలువు సాధించారు
కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఒకే విద్యా సంవత్సరంలో 298 మంది ఉద్యోగాలు సాధించారు. 8లో



ఆత్మరక్షణకు కర్రసాము
ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మాజీ సైనిక ఉద్యోగి ఉమామహేశ్వరరావు విద్యార్థులకు కర్రసాముపై శిక్షణ ఇస్తున్నారు. 8లో



పలు రైళ్ల రీషెడ్యూల్
పెయిరింగ్ రైళ్ల ఆలస్యంతో ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లను రీషెడ్యూల్ చేసినట్టు వాల్తేర్ అధికారులు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

పోర్టును సందర్శించిన తూర్పు కోస్తా రైల్వే జీఎం



తూర్పు కోస్తా రైల్వే జీఎం ఎం.కె.బెహ్రాతో పోర్టు అధికారులు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ, విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిధిలో జరుగుతున్న వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించేందుకు వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్‌తో కలిసి ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్(ఇన్‌చార్జి) ఎం.కె.బెహ్రా సోమవారం విశాఖ పోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు పరిధిలో జరుగుతున్న రైల్వే సంబంధిత అంశాలను పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దుబే వారికి వివరించారు. సరుకు రవాణాను మరింత పెంపొందించేందుకు రేక్‌లను కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోర్టు పరిధిలో జరుగుతున్న రైల్వే విద్యుదీకరణ అంశాలను సైతం విశదీకరించారు. దీనిపై ఈస్ట్ కోస్ట్ జీఎం ఎం.కె. బెహ్రా మాట్లాడుతూ రైల్వే సంబంధిత అభివృద్ధి పనులకు తమ పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పోర్టు ఉన్నతాధికారులతో పాటు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

'ఈఎన్‌టీ'కి ఎండోస్కోపీ ఉపకరణాల బహూకరణ



పరికరాలను స్వీకరిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ

ఏయూక్యాంపస్: ప్రభుత్వ చెవి ముక్కు గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రికి రెండు ఎండోస్కోపీ పరికరాలను మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళీకృష్ణ అందించారు. కేజీహెచ్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్‌టీ ఆస్పత్రిలో రోగులను పరీక్షించడానికి ఉపకరించే రూ.1.50 లక్షల విలువైన ఈ పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ హరికృష్ణ స్వీకరించారు. వీటి సహాయంతో ఓపీలో నేరుగా రోగులను పరీక్షించడం సాధ్యపడుతుందని సూపరింటెండెంట్ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షకు 20,108 మందికి గానూ 19,365 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షకు 3,873 మందికి గానూ 3,648 మంది హాజరైనట్లు ఆర్‌ఐవో పి.మురళీధర్ తెలిపారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు.. కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నాయని వెల్లడించారు.

ఘో..

అస్తవ్యస్తంగా విశాఖ రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు

రీ డెవలప్‌మెంట్ పేరుతో విశాఖ రైల్వే స్టేషన్‌ను గొప్పగా అభివృద్ధి చేస్తామని ప్రకటించిన రైల్వే మంత్రిత్వ శాఖ.. పనుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. ఏడాది నుంచి కేవలం పిల్లర్ల కోసం వేసిన గోతులు మాత్రమే దర్శనమిస్తున్నాయి. దాదాపు రూ.456 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులు అడుగు కూడా ముందుకు పడకపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- గతేడాది జూన్‌లో పనులు ప్రారంభించిన రైల్వే బోర్డు
- ఇప్పటికీ పిల్లర్ల స్థాయిలోనే ఉన్న పనులు
- సక్రమంగా పనులు జరగక ప్రయాణికుల ఇబ్బందులు
- కనీసం పట్టించుకోని వాల్తేరు డివిజన్ అధికారులు



పునాదుల్లో నిల్వ ఉన్న నీరు



నత్తనడకన సాగుతున్న అభివృద్ధి పనులు

సాక్షి, విశాఖపట్నం: దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల అభివృద్ధి చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ నడుం బిగించింది. తూర్పు కోస్తా జోన్ పరిధిలో ఉన్న అన్ని రైల్వే స్టేషన్ల కంటే అద్భుతమైన నిర్మాణంతో ఉన్న విశాఖ రైల్వే స్టేషన్‌ను కూడా రీ డెవలప్‌మెంట్ చేసేందుకు రైల్వే బోర్డు సిద్ధమైంది. విశాఖలో ప్రయాణికుల సౌకర్యంతో పాటు వాణిజ్య అవసరాలకు అనుగుణంగా స్టేషన్ అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. దీనికనుగుణంగా గతేడాది ఏప్రిల్‌లో రూ.456 కోట్లకు టెండర్లు పిలిచి పనులు అప్పగించింది. జూన్ మొదటి వారంలో పనులకు శ్రీకారం చుట్టారు. ఆధునికీకరణ పనులు మొదట్లో చురుగ్గానే సాగాయి. కేవలం నెల రోజుల తర్వాత ఎక్కడ వేసిన గొంగళిలా అన్నట్లుగా పనులు ఆగిపోయాయి.

కీలక పనులపై ఇంత నిర్లక్ష్యమా.?

ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజూ 45 నుంచి 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. స్టేషన్ రీ డెవలప్‌మెంట్ పనులు జరిగితే 75 నుంచి 90 వేల మంది రాకపోకలకు వీలుంటుంది. ప్రయాణికుల కోసం 32 ఎస్కలేటర్లు, వృద్ధులు, దివ్యాంగ ప్రయాణికుల కోసం 20 లిఫ్టులు ఏర్పాటు కానున్నాయి. ఇవన్నీ 24 నెలల్లో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికే ఏడాది గడుస్తున్నా.. ఇంచు కూడా ముందుకు కదల్లేదు. పనులు జరుగుతున్న తీరుపై వాల్తేరు డివిజన్ అధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రయాణికుల ఇబ్బందులను కూడా పట్టించుకోకుండా రైల్వే అధికారులు వ్యవహరిస్తున్నారంటూ విశాఖ ప్రజలు వాపోతున్నారు.

పనులు జరిగితే అద్భుతమే..

ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించడంతో పాటు స్టేషన్‌లో అత్యాధునిక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. అత్యాధునిక స్కైవాక్‌లతో ప్రయాణికులు స్టేషన్‌కు వచ్చినప్పటి నుంచి రైలు ఎక్కేంత వరకూ అత్యంత సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. స్టేషన్ డిపార్చర్ హాల్‌ను కలుపుతూ రూఫ్ ప్లాజా, బయలుదేరే ప్రయాణికులందరికీ ఒక సాధారణ వెయిటింగ్ ఏరియా కలిగి, ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేలా విభిన్న డిజైన్లతో ప్లాట్‌ఫామ్‌లని నిర్మించనున్నారు. ఒక సాధారణ ప్రయాణికుడు రైల్వే స్టేషన్‌కి వస్తే ఎలాంటి ఇబ్బంది ఎదురవ్వకుండా అత్యాధునిక మాల్‌కి వచ్చినట్లుగా ఎంజాయ్ చేస్తూ వెళ్లేలా స్టేషన్ రూపురేఖలు మారిపోయేలా సాగుతాయనుకున్న పనులు క్రమంగా మందగించిపోవడంపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా గోతులు

8వ నంబర్ ప్లాట్‌ఫామ్ వైపు ఉన్న ప్రవేశ ద్వారం పరిసరాల్లో పెద్ద పెద్ద చెట్లను తొలగించి ఏడాది క్రితం భూమిని చదును చేశారు. పునాదులు, పిల్లర్ల కోసం పెద్ద పెద్ద గోతులు తవ్వారు. అప్పటి నుంచి ఆ గోతులు అలాగే మిగిలిపోయాయి. వర్షపు నీటితో నిండిపోయి ప్రమాదకరంగా మారాయి. గోతులు తవ్వినప్పటి నుంచి జ్ఞానాపురం వైపు ఉన్న నాలుగో నంబర్ గేటు నుంచి రాకపోకలు నిలిపివేశారు. అంటే 8వ నంబర్ ప్లాట్‌ఫామ్‌వైపు వెళ్లాలంటే.. 5వ నంబర్ గేట్ నుంచి వెళ్లాల్సి వస్తోంది. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు.

జ్ఞానాపురం వైపు రూపురేఖలు మారుతాయా..?

రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా ఎనిమిదో నంబర్ ప్లాట్‌ఫామ్ ఉన్న జ్ఞానాపురం ప్రాంత ఎంట్రన్స్ పూర్తిగా రూపురేఖలను మార్చుకోనుంది. తొలి విడతలో భాగంగా జ్ఞానాపురం వైపు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఎనిమిది ప్లాట్‌ఫామ్‌లుండగా.. అదనంగా మరో రెండు నిర్మించనున్నారు. మొత్తం 10 ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి రావడం వల్ల.. అవుటర్‌లో ప్లాట్‌ఫామ్‌ల కోసం రైళ్లు నిరీక్షించే అవస్థలు చాలా వరకు తగ్గుతాయి.

ఫలితంగా ప్రయాణికులకు కొంత ఉపశమనం కలిగినట్లే. ప్రస్తుతం విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి రోజుకు 110 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో 37 రైళ్లు ఇక్కడి నుంచే బయలుదేరుతున్నాయి. రీడెవలప్‌మెంట్ జరిగిన తర్వాత 10 ప్లాట్‌ఫామ్‌ల నుంచి రోజుకు అదనంగా మరో 20 రైళ్లు రాకపోకలు సాగించే అవకాశం ఉంది.



జ్ఞానాపురం వైపు పరిస్థితి ఇలా..

ఎన్‌బీఏ గుర్తింపు సాధనలో

మనమే నంబర్ 1

- తర్వాత స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ
- రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి



విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నాగరాణి

మురళీనగర్: నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) సాధించడం అందని ద్రాక్షలాంటిదని భావించే వారికి ఆంధ్రప్రదేశ్ సాధించిన ప్రగతి ఆదర్శంగా నిలుస్తుంది. పాలిటెక్నిక్ కాలేజీల్లో నిర్వహించే కోర్సులన్నింటికీ ఎన్‌బీఏ సాధించడం ఒక వరంలా భావిస్తారు. ఇప్పటి వరకు అదొక బ్రహ్మ పదార్థంగా భావించిన వారికి మన పాలిటెక్నిక్‌లు ఎన్‌బీఏ గుర్తింపు సాధించి దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం చారిత్రాత్మకంగా నిలుస్తుంది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా సి.నాగరాణి బాధ్యతలు చేపట్టిన తర్వాత సాంకేతిక విద్యా వ్యవస్థలో ప్రక్షాళనలు జరిగి అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయి. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సోమవారం ఆమె సందర్శించారు. జాబ్ అచీవర్స్ డే కార్యక్రమంలో పాల్గొని.. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.

ప్రతిష్టాత్మకంగా ఎన్‌బీఏ గుర్తింపు

జాతీయస్థాయిలో మన రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలకు గుర్తింపు సాధించాలని ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నాం. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు రావడం మకుటాయమానంగా నిలుస్తుంది. దీని వల్ల మన విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విలువ పెరిగి అత్యుత్తమ ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. అందుకే ప్రభుత్వ కాలేజీలు ఎన్‌బీఏ గుర్తింపు కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేశాం. రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి.. దీని వల్ల మన ప్రతిష్ట ఎలా పెరుగుతుందో వివరించాం. ఇందుకోసం ఎన్‌బీఏ కో–ఆర్డినేషన్ బృందాలను ఏర్పాటు చేశాం. నిరంతరం పర్యవేక్షిస్తూ ఇందుకు అవసరమైన వనరులను సమకూర్చాం. ఏడాది పాటు శ్రమించాం.

ఎన్‌బీఏ అధికారుల బృందం అన్ని రకాల పారామీటర్స్ నిశితంగా పరిశీలించి సంతృప్తి చెందితేనే గుర్తింపునకు సిఫార్సు చేస్తుంది. కాలేజీల్లోని మౌలిక సదుపాయాలు, బోధనాభ్యసన విధానాల్లో సృజనాత్మకత, బోధనా ప్రమాణాలు, విద్యా ప్రమాణాలు, ఫలితాలు, ల్యాబ్, టెక్నాలజీ, లైబ్రరీ వినియోగం వంటి అంశాలను పరిశీలిస్తుంది. అందరి కృషి ఫలితంగా మన రాష్ట్రంలో 40 ప్రభుత్వ కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం. మహారాష్ట్రలో 30 కాలేజీలకు గుర్తింపు రావడంతో రెండవ స్థానంలో, తెలంగాణలో 26 కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపుతో మూడవ స్థానంలో ఉన్నాయి. మన రాష్ట్రంలో మిగతా కాలేజీలకు ఎన్‌బీఏ గుర్తింపు కోసం కృషి జరుగుతోంది. ఎన్‌బీఏ గుర్తింపు వల్ల కొత్త కోర్సులు ప్రారంభించడంతో పాటు విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఇక్కడి విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు.

12 వేల మందికి ఉద్యోగాలు

మన రాష్ట్రంలో ఈ ఏడాది (2023–24)లో 12,000 మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. ప్రత్యేక డ్రైవ్‌ల నిర్వహణ ద్వారా ఇది సాధించాం. మునుపెన్నడూ లేని విధంగా క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం సెంట్రలైజ్డ్ పర్యవేక్షణ చేస్తూ అన్ని కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు, టీపీవోలు, కంపెనీ ప్రతినిధులు ఒకే వేదికపై చర్చించి.. కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేయడానికి సూచనలిస్తున్నాం. రాష్ట్రస్థాయిలో ఇందుకోసం డిప్యూటీ డైరెక్టర్ స్థాయిలో ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్‌గా డాక్టర్ ఎంవీ రామకృష్ణ పనిచేస్తున్నారు. కనీసం వారానికోసారి దీనిపై సమీక్ష నిర్వహించడం వల్ల మంచి సత్ఫలితాలు వచ్చాయి. పాడేరు, చీపురుపల్లి, శ్రీశైలం, మడకశిర, ధర్మవరం, రాయచోటి వంటి మారుమూల ప్రాంతాల్లోని పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించారు. సెంట్రల్, క్లస్టర్ డ్రైవ్‌లు, కాలేజీల వారీగా క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ఇది మంచి ఫలితాలినిచ్చింది. మేనేజ్‌మెంట్‌తో సంబంధం లేకుండా ప్రైవేట్ కాలేజీల్లో కూడా ప్లేస్‌మెంట్‌ల కోసం ప్రత్యేక క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణనిస్తున్నాం. సిలబస్‌లో మార్పులు తెచ్చాం. మన విద్యార్థులను టెక్నాలజీ 4.0 దిశగా తయారు చేస్తున్నాం.

ఉద్యోగాలిచ్చే వారికి రెడ్/గ్రీన్ కార్పెట్‌లు

మన విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వడానికి ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు రెడ్/గ్రీన్ కార్పెట్‌లతో ఆహ్వానిస్తున్నాం. పాలిటెక్నిక్ కళాశాలల టీపీవోలు ప్రత్యేక ఎంవోయూలు కుదుర్చుకుంటున్నారు. దీని వల్ల ప్రతి కాలేజీలోనూ కనీసం 70 శాతం మంది ఉద్యోగాలు పొందుతున్నారు. మల్టీ నేషనల్ కంపెనీలు మన విద్యార్థులకు మంచి ఆఫర్‌లు ఇస్తున్నాయి. అత్యధికంగా రూ.8.25 లక్షల నుంచి రూ.5 లక్షలు, 4 లక్షలకు పైగా వార్షిక ప్యాకేజీలతో ఉద్యోగాలు వస్తున్నాయి. ఒక విద్యా సంవత్సరంలో కాలేజీ విద్యార్థుల సంఖ్యను బట్టి వంద నుంచి 300 మంది వరకు ఉద్యోగాలు సాధించడమంటే మాటలు కాదు. ఇది అందరి సమన్వయంతో.. కృషి చేయడం వలనే సాధ్యమైంది. ఈ పరంపర రానున్న కాలంలో కొనసాగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పర్యటన



వడ్లపూడి వ్యాగన్ వర్క్‌షాప్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జీఎం బెహరా

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ ఎం.కె.బెహరా సోమవారం వాల్తేర్ డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, పనితీరును పరిశీలించారు. వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్‌ను సందర్శించి, అక్కడి సదుపాయాలు, నిర్వహణ కార్యకలాపాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో డివిజనల్ ఉన్నతాధికారులతో సమావేశమై పలు విషయాలు చర్చించారు. ఈ పర్యటనలో జీఎంతో పాటు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌కే సేనాపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఒడిశా కార్మికుడి మృతి



హేమంత్ భుయ్ మృతదేహం

పద్మనాభం: మద్దిలోని ఇటుక బట్టీలో పని చేస్తున్న ఒడిశాకు చెందిన హేమంత్ భుయ్(27) అనే కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మద్దిలో పోక శ్రీనివాసరావు ఇటుక బట్టీలో కూలి పనిచేయడానికి ఒడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా బాబాలజురి సమీపంలోని బందబుజూరికి చెందిన హేమంత్ భుయ్ తన భార్య రోజి బామ్‌తో కలసి ఈ ఏడాది జనవరిలో వచ్చాడు. సోమవారం బట్టీలో పనిచేస్తుండగా హేమంత్ భుయ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్ వచ్చే సరికి ఆయన మృతి చెందాడు. హేమంత్ గుండెపోటుతో మరణించినట్లు 108 సిబ్బంది నిర్ధారించారని పోలీసులు వెల్లడించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- శిక్షణ సదస్సులో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో డీఆర్వో మోహన్ కుమార్



శిక్షణ కార్యక్రమానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట : పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించాలని, అధికారులందరూ సమాయత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై చిల్డ్రన్ ఎరీనాలో సోమవారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఓట్ల లెక్కింపు విధానంలో అనుసరించాల్సిన విధివిధానాలపై మార్గనిర్దేశం చేశారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది ప్రతి అంశంపైనా అవగాహన కలిగి ఉండాలని, సందేహాలుంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లకు లెక్కింపు ప్రక్రియ గురించి, ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అక్కడ అనుసరించే విధానాలు, సంప్రదాయాల గురించి వివరించాలని చెప్పారు.

ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా ఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని, సమయ స్ఫూర్తితో వ్యవహరించి పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి అంశం వీడియో రికార్డింగ్ జరుగుతుందని, సీసీ కెమెరాలు కూడా ఉంటాయని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో బెల్ ఇంజనీర్లు అందుబాటులో ఉంటారని, ఏమైనా సాంకేతిక సమస్యలు వస్తే వారి సహాయం తీసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు సమయంలో చిన్నపాటి తప్పిదాలు కూడా జరగకుండా అప్రమత్తంగా ఉంటూ ప్రక్రియను నిర్వహించాలన్నారు. 17సీ పార్ట్–1, 17సీ పార్ట్–2లో నిక్షిప్తమైన వివరాలను బేరీజు వేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లను తీసుకురావడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధానాలపై వివరించారు. కౌంటింగ్ హాలు నమూనా, అధికారుల బాధ్యతలు తదితర అంశాలను తెలిపారు. నివేదికలు తయారీలో, ఫలితాల వెల్లడిలో అనుసరించాల్సిన పద్ధతులపై వివరించారు. ఈ క్రమంలో అధికారులు సందేహాలను నివృత్తి చేశారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ లెక్కింపు సమయంలో తలెత్తే సమస్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్ వైజర్లు, అసిస్టెంట్ సూపర్ వైజర్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్టీల్ టౌన్‌షిప్‌లో విద్యుత్ చార్జీల పెంపు వాయిదా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో విద్యుత్ చార్జీల పెంపును యాజమాన్యం మూడు నెలలు వాయిదా వేసింది. ఈ మేరకు సీఎండీ అతుల్ భట్ కార్మిక సంఘాలకు హామీ ఇచ్చారు. టౌన్‌షిప్ క్వార్టర్ల విద్యుత్ చార్జీలు యూనిట్ ధర రూ.50 పైసలు నుంచి రూ.8కు పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసి అమలు కూడా ప్రారంభించింది. ఈ అంశంపై ఉక్కు కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశాయి. చార్జీల పెంపు అంశంపై సోమవారం ఉక్కు పరిపాలన భవనంలో కార్మిక సంఘాల నాయకులు సీఎండీ అతుల్ భట్‌ను కలిసి తమ వాదనను వినిపించారు. త్రైపాక్షిక ఒప్పందం మేరకు కార్మికులకు 50 పైసలు రేటు అమలు జరుగుతోందన్నారు. అయితే యాజమాన్యం ఏకపక్షంగా రూ.8కు పెంచడం అన్యాయమన్నారు. ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని వారు సీఎండీకి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎండీ మూడు నెలల పాటు చార్జీల పెంపు నిలిపి వేస్తామని, లేబర్ కమిషనర్ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ఈ నెల కటింగ్‌ను కూడా నిలిపి వేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు వారు నిర్ణయించిన రేట్లకు క్వార్టర్ల ఎలాట్‌మెంట్ చేయాలన్న కార్మిక సంఘాల విజ్ఞప్తిని ఆయన అంగీకరించినట్టు నాయకులు తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, వై.టి.దాస్, యు.రామస్వామి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎంఏఐ విశాఖ చాప్టర్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి అభినందనలు తెలుపుతున్న సీఎంఏలు

విశాఖ విద్య: ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) విశాఖ పట్నం చాప్టర్‌కు నూతన కమిటీ ఏర్పాటైంది. అక్కయ్యపాలెం లోని సీఎంఏ భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో చాప్టర్ బాధ్యులు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాప్టర్ నూతన కమిటీ చైర్మన్‌గా యు.లక్ష్మణరావు, వైస్ చైర్మన్‌గా జి. రామలింగారెడ్డి, కార్యదర్శిగా వి.శాంతి శిరీష , కోశాధికారిగా ఎం. హిమబిందు ఎన్నికయ్యారు. అదే విధంగా పీబీ కృష్ణమాచారి, బి.నరేంద్ర, ఎస్.వెంకటేష్, బి.సంపత్, ఎస్.రాజశేఖర్ కమిటీ సభ్యులుగా ఎంపియ్యారు. చాప్టర్ నూతన పాలక మండలి 2024–25 సంవత్సరానికి పనిచేస్తుందని చైర్మన్ లక్ష్మణరావు తెలిపారు. సీఎంఏ విద్యనభ్యసించే విద్యార్థులకు తోడ్పాటు అందించడంతో పాటు చాప్టర్ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు.



నిందితుడికి 14 రోజుల రిమాండ్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు మసీదు వీధిలో మార్చి 18న బంగారు, వెండి ఆభరణాలు, నగదు, సెల్‌ఫోన్ దొంగిలించిన మాణిక్యానికి భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన బాధితుడు జల్ల శోభూషణరావు డీవీస్ ఉద్యోగి. భార్య పుట్టింటికి, అతను నైట్ డ్యూటీకి వెళ్లిన సమయంలో నిందితుడు వారి ఇంట్లో చొరబడి ఈ దొంగతనం చేశాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు సోమవారం న్యాయస్థానంలో లొంగిపోవడంతో.. న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించినట్లు భీమిలి క్రైం పోలీసులు తెలిపారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,710
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,650
వెండి(కిలో)	రూ.97,500

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	:రూ.142
స్కిన్	:రూ.254
స్కిన్‌లెస్	:రూ.264

మహారాణిశ్రీ విశాఖపట్నం 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 823/2022 in O.S. 1419/2011
Between:
శ్రీమతి కె. గంగమ్మ & వగైరాలు ...పిటీషనర్లు/వాదులు
And
శ్రీమతి కె. రాముళ్యాలమ్మ & వగైరాలు ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు
వేలం ప్రకటన
పైనెంబరు పార్టిషన్ దావాలో షెడ్యూల్‌లో పొందుపరిచిన ఆస్తి వాటాదారుల మధ్య విభజనకు అవకాశం లేనందున మహారాణిశ్రీ కోర్టు వారు షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలం ద్వారా అమ్మి సదరు రాబట్టిన మొత్తంను వాటాదారులకు పంచుటకు నిర్ణయించి ఈ వేలం ప్రకటన జారీచేయడమైనది. సదరు తేది. 24-06-2024 వేలం వేయుటకు మహారాణిశ్రీ కోర్టువారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలం తేది. 24-06-2024న ఉ॥ గం॥ 10.30 ని॥ల నుండి సా॥ 5 గం॥ల మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలం పాటలో పాల్గొనదలచిన ఆసక్తిగలవారు పై తేదిన పైన తెలిపిన శ్రీ కోర్టువారి ఎదుట హాజరై వేలం షరతులకు లోబడి పాడుకొనవచ్చునని ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయడమైనది. షెడ్యూలు ఆస్తి వివరములు
విశాఖపట్నం జిల్లా, జి.వి.యం.సి ఏరియా, వాల్తేరు వార్డు, బ్లాక్ నెం. 46, T.S.No: 1035 in T.P. No. 200/59 లేబిట్ (Presently called as సి.బి.యం. కాంపౌండ్) ఇంటి స్థలం విస్తీర్ణం 50 చ॥గ॥లు మరియు అస్థలములో గల ఇల్లు bearing D.No: 9-17-47, consisting two shop Rooms in గ్రౌండ్ ఫ్లోర్ అండ్ ఫస్ట్‌ఫ్లోరు మరియు రెండవ ఫ్లోర్. Bounded by: తూర్పు: రోడ్డు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: యస్. భీముడుగారి ఇల్లు, పశ్చిమం: యు.అప్పలస్వామి గారి ఇల్లు.
Sub Registrar Value for Site:
Rate per Square Yard Rs. 75,000/-
Sub Registrar Value for Building:
Per Sft. Rs.1,400/- upto Second Floor
Sub Registrar Value for ACC Sheet:
Per Sft. Rs. 700/-
V. LAKSHMI PRASAD, Advocate
TF-4, Viswakala Apartment, Doctors Colony
Peda Waltair, VSP. Cell:97018 41819

కలలు కన్నారు.. కొలువు సాధించారు


పాలిటెక్నిక్ విద్యార్థినికి నియామకపత్రాన్ని అందిస్తున్న కమిషనర్ నాగరాణి

- ఉద్యోగాలు సాధించిన 298 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు
- వేడుకగా జాబ్ అచీవర్స్ డే
- కుటుంబాలకు అండగా నిలవండి
- విద్యార్థులకు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సూచన

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యనభ్యసించిన అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు.. మీ తల్లిదండ్రులు, కుటుంబానికి అండగా నిలవాలని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి పిలుపునిచ్చారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన సోమవారం జాబ్ అచీవర్స్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించడం ఒక ఎత్తు అయితే.. దానిని నిలబెట్టుకోవడం మరొక ఎత్తు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఒక విద్యా సంవత్సరంలో 298 మందికి ఉద్యోగాలు రావడం ఒక రికార్డుగా ఆమె పేర్కొన్నారు. ఎంతో మంది సమన్వయంగా పని చేస్తే గానీ ఇంతటి మంచి ఫలితాలు రావడం కష్టమన్నారు. ఇప్పుడు ఉద్యోగాలు పొందిన విద్యార్థులందరూ మరొక ఆలోచన లేకుండా వెంటనే విధుల్లో చేరాలని సూచించారు. రెండేళ్ల **సర్వీసు చేసిన తర్వాత ఉన్నత చదువులు చదువుకోవడానికి కంపెనీలు అవకాశం ఇస్తున్నాయని చెప్పారు. 18 ఏళ్లకే అత్యధిక ప్యాకేజీలతో మల్టీనేషనల్ కంపెనీల్లో** ఉద్యోగాలు రావడం అదృష్టంగా భావించాలన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు అద్భుతమైన ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించడానికి సాంకతిక విద్యా శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్ డిమాండ్‌లను తీర్చేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నామని కమిషనర్ వివరించారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హరిబాబు, ఇతర శాఖల హెడ్‌లను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నియామక పత్రాలు అందించారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డీడీ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, స్టేట్ కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ కె.జానకీరామ్ ప్రసంగించారు. స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ జి.వి.ఎస్ ప్రసాద్, ఒడిన్ కంట్రోల్ ఎండీ ఎస్.నందగోపాల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, టీపీవో హరిబాబు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఆమె వివిధ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు.


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి

298 మందికి ఉద్యోగాలు

పాలిటెక్నిక్ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థికీ ఉద్యోగం కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తమ కాలేజీలో చదివిన 298 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, థాట్‌వర్క్స్, మేఘా ఇంజినీరింగ్, జీఈ ఏరోస్పేస్, మోస్ చిప్, సుజ్లాన్, అమర్‌రాజా, ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా, ఎఫ్‌ట్రానిక్స్, మేధా సర్వో, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, షాపూర్జీ పల్లంజీ, అల్ఫాజ్ లఫల్‌స్కీ, ట్రావల్‌కి, ట్రావల్ ప్రాజెక్ట్, రాయల్ ఎన్‌ఫీల్డ్, వీల్స్ ఇండియా, స్మార్ట్‌డీవీ టెక్నాలజీస్, నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్, హెచ్‌ఎల్ మాండో ఆనంద్ ఇండియా వంటి ప్రధాన సంస్థల్లో విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని వివరించారు.

కమిషనర్‌కు కృతజ్ఞతలు



మాకు మంచి ఉద్యోగాలు రావడానికి కృషి చేసిన కమిషనర్‌కి మా కాలేజీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఒకే సంవత్సరంలో 298 మందికి ఉద్యోగాలు రావడం చాలా గొప్ప విషయం. నాకు చెన్నైలోని టెక్నిక్ ఎనర్జీస్‌లో రూ.4 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. పాస్‌అవుట్ అయ్యే నాటికి ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. నాన్న ఎంజీ నాయుడు ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తూ నన్ను చదివిస్తున్నారు.

– ఎ.దేవహర్షిణి, మెకానికల్ డిప్లమో, సాగర్‌నగర్

మేము చాలా లక్కీ



డిప్లమో విద్యార్థిగా బీటెక్ స్థాయిలో వార్షిక ప్యాకేజీ సాధించడం చాలా లక్కీ. టెక్నిక్ ఎనర్జీలో రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యాను. నాన్న శ్రీను కూలి పనులు చేస్తూ మా కుంటుంబాన్ని పోషిస్తున్నారు. ఉద్యోగంలో చేరి నాన్నకు అండగా ఉంటాను.

– ఎల్.శృతి, మెకానికల్ డిప్లమో, కైలాసపురం

ఈ కాలేజీలో చదవడం నా అదృష్టం



కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో చదవడం నా అదృష్టం. నా సీనియర్లు కూడా మంచి ఉద్యోగాలు పొందారు. నేను శ్రీకాకుళం నుంచి ఇక్కడికి వచ్చి హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాను. హైదరాబాద్ షాపూర్‌జీ పల్లంజీలో ఉద్యోగం వచ్చింది. వెంటనే విధుల్లో చేరడానికి సిద్ధమవుతున్నాను.

–జి.తేజస్విని, సివిల్ ఇంజినీరింగ్

రూ.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



నాకు ముంబయిలోని ఆల్ఫా లావెల్‌లో రూ.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. మల్టీనేషనల్ కంపెనీలో మంచి ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉంది. మా ప్రిన్సిపాల్, టీపీవో, డిపార్టుమెంట్ హెడ్‌లు, అధ్యాపకుల సహకారంతో ఈ ఘనత సాధించాను. మాది చాలా పేద కుటుంబం. ఈ ఉద్యోగం రావడంతో మా అమ్మానాన్న ఎంతో సంతోషిస్తున్నారు.

– అఖిల్ కుమార్ నాయక్, మెకానికల్ ఇంజినీరింగ్, అగనంపూడి

పలు రైళ్ల రీషెడ్యూల్



తాటిచెట్లపాలెం: పలు పెయిరింగ్ రైళ్ల ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్లను రీషెడ్యూల్ చేసినట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్‌లో సోమవారం సాయంత్రం 4.35 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్–అగర్తల(07030) సమ్మర్ స్పెషల్ సుమారు 7 గంటలు ఆలస్యంగా రాత్రి 11.35 గంటలకు బయల్దేరింది.
- సంత్రగచ్చిలో సోమవారం సాయత్రం 6 గంటలకు బయల్దేరాల్సిన సంత్రగచ్చి – తాంబరం(22841) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 17 గంటలు ఆలస్యంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు బయల్దేరనుంది.
- హౌరాలో సోమవారం ఉదయం 10.50 గంటలకు బయల్దేరాల్సిన హౌరా–ఎస్ఎంవీ బెంగళూరు(22863) ఎక్స్‌ప్రెస్ 2 గంటల ఆలస్యంగా మధ్యాహ్నం 12.50 గంటలకు బయల్దేరింది.
- హౌరాలో సోమవారం సాయంత్రం 4.15 గంటలకు బయల్దేరాల్సిన హౌరా–కన్యకుమారి(12665) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటల ఆలస్యంగా రాత్రి 6.30 గంటలకు బయల్దేరింది.
- చెన్నై సెంట్రల్‌లో సోమవారం రాత్రి 7 గంటలకు బయల్దేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–హౌరా(12840) సూపర్‌ఫాస్ట్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయల్దేరింది.

రైల్లో ప్రయాణికుడి మృతి

పార్వతీపురం టౌన్: పుణ్య క్షేత్రాలను సందర్శించి తిరిగి ఇంటికి వస్తుండగా ఓ ప్రయాణికుడు రైల్లో గుండెపోటుతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జిల్లా పెందుర్తిలోని నూకాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన కొందరు పుణ్యక్షేత్రాలకు వెళ్లారు. వారిలో రాళ్లపల్లి సత్యనారాయణ (63), ఆయన భార్య మణి ఉన్నారు. వారంతా తిరుగు ప్రయాణంలో భాగంగా ఢిల్లీలో సమతా ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. టిట్లాఘడ్ వచ్చేసరికి సత్యనారాయణ అస్వస్థతకు గురికావడంతో అక్కడే దిగిపోయి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కొంచెం నయం కావడంతో నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో మళ్లీ ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో పార్వతీపురం సమీపానికి వచ్చే సరికి సత్యనారాయణ తీవ్ర అస్వస్థతకు గురై గుండె పోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది జీఆర్పీ సిబ్బందికి తెలియజేయగా వారు సత్యనారాయణ భార్య మణి నుంచి వివరాలు సేకరించి మృతదేహాన్ని అత్యవసర వాహనంలో పెందుర్తి తరలించారు.

ఆత్మరక్షణకు కర్రసాము




కర్రసాములో శిక్షణ పొందుతున్న చిన్నారులు



ప్రాచీన కళల్లో కర్రసాము ఒకటి. పూర్వం కర్రసామును ఆచారంగా నిర్వహించేవారు. కాలానుగుణంగా ఆ కళపై ఆసక్తి తగ్గిపోయింది. అయితే ఇప్పుడిప్పుడు ఈ ప్రాచీన కళలో శిక్షణ తీసుకునేందుకు బాలికలు ముందుకొస్తున్నారు. విద్యార్థుల ఆసక్తిని గమనించిన మాజీ సైనిక ఉద్యోగి ఉమామహేశ్వరరావు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. నేటితరం చిన్నారులు ప్రత్యేకంగా అమ్మాయిలు కర్రసాముకు జై కొడుతున్నారు. క్రమం తప్పకుండా శిక్షణకు హాజరై.. కర్ర పట్టుకుని గిరగిరా తిప్పుతూ ఔరా అనిపిస్తున్నారు. కర్ర యుద్ధం చేస్తూ.. చూపరులను ఆకట్టుకుంటున్నారు. ఆత్మ రక్షణ కోసం ఈ విద్య నేర్చుకుంటున్నట్లు బాలికలు చెబుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాక్షి క్లాసిఫైడ్స్

Education
Paramedical Science and Nursing Courses Admission open now Praveen Institute of Paramedical & sciences. Please Contact : M/s. S.R.Hospital, Near Rythu Bazar, Gopalapatnam, Vizag. Call : Mr. T.Srinivas, General Manager. Ph : 82979 52222 [V- 2553]

Real Estate
PLOT FOR SALE
విశాఖ దువ్వాడ రైల్వేస్టేషన్‌కి 4 కి.మీలలో 3 లక్షలకే 80 గజాలు ఇంటి స్థలం, 20 బిట్లు కలవు. 10 కి.మీలలో 5 లక్షలకే 150 గజాలు 18 బిట్లు. EMI కలదు. ఫోన్ : 73867 55281 [V- 786914]
విశాఖ వార్డు పరిధి 116 గజాలు 6 లక్షలు, 150, 200 గజాలు 93 బిట్లు, ఇల్లులు, బస్సులు, బజారు, షాప్‌లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్, EMI కలదు. ఫోన్ : 80196 24319 [V- 786913]

Services
BUSINESS OFFER
మీకు నచ్చిన అన్నిరకాల "జిడిపే" సర్వీసులను మార్కెటింగ్ చేసినవారికి "స్పాట్‌లో ఆదాయం". పనిచేయ(లే)నివారికి అంతో, ఇంతో, ఎంతో కొంత ఆదాయం. ★షరతులు వర్తించును. ఫోన్ : 63001 72408 [V- 2546]
GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12047]

CHANGE OF NAME
I, BOMMI REDDY INDIRA PRIYA DARSHINI, W/o. BOMMIREDDY JEEVAN KUMAR, 3-16-1/11, Rajyalakshmi Nagar,chaitanya College, Venkat Nagar, kakinada, 533003 have changed My name from MANDANAKKA INDIRA PRIYA DARSINI, (old name) to BOMMI REDDY INDIRA PRIYA DARSHINI, (new name), hence after all my documents and correspondence will continue with my new name BOMMI REDDY INDIRA PRIYA DARSHINI

Wanted
గెస్ట్ హౌస్‌లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ బాయ్స్ కావలెను. ఉచిత రూం + భోజనం, జీతం : 12K. ○ రైల్వే షెడ్ వద్ద సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఫోటో, బయోడేటా వాట్సాప్ చేయండి. జీతం : 18K. RSR వైజాగ్. ఫోన్ : 73065 82829 [V- 1563]
సువర్ణభూమి కంపెనీలో పనిచేయుటకు 10th - PG చదివిన యువతి / యువకులు కావలెను. 7500/- నుండి 25000/- జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. చినబాబు (జనరల్ మేనేజర్). ఫోన్ : 83419 19629 [V- 823795]
వైజాగ్, అనకాపల్లికి Delivery Boys & Helpers కావలెను. P.F, ESI కలదు ప్రతి ఆదివారం శెలవు. ఫోన్ : 81061 05517, 97046 15536, 98490 80059 [V- 791081]
గాజువాక ఆఫీస్‌లో పనిచేయుటకు రిసెప్షనిస్ట్-5, టెలీకాలర్స్-10, టైలరింగ్ పనిచేసేవారు-30, ప్యాకింగ్ పని చేసేవారు-50, హౌస్‌కీపర్స్-5 కావలెను. ఫోన్ : 81217 29363 [V- 786912]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

హ్యాండ్‌లూమ్ ఇండియా ఎక్స్‌పోకు విశేష స్పందన


చీరను పరిశీలిస్తున్న మహిళ

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్‌లోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్‌లూమ్ ఇండియా ఎక్స్‌పోకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఎక్స్‌పోలో డిజైన్ల చీరలు, సల్వార్లు, టాప్స్, లెనిన్‌తో సహా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పోచంపల్లి, కలంకారి చీరలు నుంచి సంప్రదాయ కోల్‌కతా, లక్నో చీరలు, బెనారస్ పట్టు చీరలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. ఈ ప్రదర్శన మంగళవారం రాత్రి 8 గంటలతో ముగుస్తుందని, నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మావోయిస్టుల కదలికలపై అప్రమత్తం

భారీ డంప్ స్వాధీనంతో కూంబింగ్ ముమ్మరం


గాలింపులో నిమగ్నమైన పోలీసు బలగాలు

సాక్షి,పాడేరు: ఏవోబీలో మావోయిస్టుల కదలికలపై పోలీసుశాఖ అప్రమత్తమైంది. మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల పోలీసు బలగాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి. అణువణువు గాలింపు చర్యలు చేపట్టాయి. దీనిలో భాగంగానే గూడెంకొత్తవీధి మండలంలో మావోయిస్టు ప్రభావిత గాలికొండ పంచాయతీలోని పనసలబంద అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు భారీ డంప్‌ను పోలీసులు గుర్తించడం తెలిసిందే. దీనిని చాకచక్యంగా నిర్వీర్యం చేసి స్వాధీనం చేసుకున్నారు. పోలీసుపార్టీలను హతమార్చే లక్ష్యంగా మావోయిస్టులు ఈ డంప్‌ను ఏర్పాటుచేశారని ఇప్పటికే ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రకటించారు. మావోయిస్టులకు పేలుడు పదార్థాలు లభించడంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మందుపాతరలు, పేలుడు సామగ్రిని గుర్తించేందుకు కూంబింగ్ పార్టీలు, బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు నిమగ్నమయ్యాయి. మరోవైపు మావోయిస్టు పార్టీ నేతలు, సభ్యులు, మిలీషియా సభ్యులు జనజీవన స్రవంతిలోకి చేరి స్వేచ్ఛగా జీవించాలని పోలీసుశాఖ పిలుపునకు మంచి స్పందన లభిస్తోంది. మావోయిస్టు పార్టీ పెదబయలు దళానికి చెందిన 13 మంది కీలక మిలీషియా సభ్యులు తాజాగా ఎస్పీ ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు. వీరిలో 2014 నుంచి మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నవారున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ గిరిజనులంతా అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. ప్రశాంత మన్యం లక్ష్యంగా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మావోయిస్టు పార్టీ కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

ముగ్గురు అటవీ అధికారుల సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

కొయ్యూరు: స్మగ్లర్లతో చేతులు కలిపి అటవీసంపదకు నష్టం కలిగించిన ముగ్గురు అటవీ అధికారులపై ఆశాఖ ముఖ్య సంరక్షణ అధికారి(సీసీఎఫ్) కొరఢా ఝులిపించారు. కొయ్యూరు సెక్షన్ పరిధి సోలాబు టేకు ప్లాంటేషన్‌లో 21 చెట్లు నరికి స్మగ్లర్లు పట్టుకుపోయారు. కొత్తపల్లి ప్రాంతంలోని అటవీ ప్లాంటేషన్‌లో మారుజాతి కలపకు చెందిన సుమారు 110 చెట్లు తరలిపోయాయి. గొల్లువలస ప్రాంతంలో పోడు వ్యవసాయం పేరిట సుమారు విలువైన వంద చెట్లు నరికివేతకు గురయ్యాయి. దీనిపై కొద్దిరోజుల క్రితం కంచే చేను మేస్తే అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్ స్పందించారు. క్షేత్రస్థాయిలో ఆయా ప్రాంతాలను పరిశీలించి అటవీసంపదకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదించారు. దీనిపై విశాఖ సర్కిల్ సీసీఎఫ్ చర్యలు తీసుకున్నారు. ఇందుకు బాధ్యులైన కొయ్యూరు సెక్షన్ అధికారి సింహాద్రి, కాకరపాడు బీట్ అధికారి రాజ్‌కుమార్, మంప బీట్ అధికారి రాకేష్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు డీఎఫ్‌వో తెలిపారు.

● కాఫీకి పునరుజ్జీవం

రూ.5 కోట్లు.. కోటి మొక్కలు

కాఫీ తోటలను అభివృద్ధి చేసి గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచేందుకు కేంద్ర కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏలో సంకల్పించాయి. ఇప్పటివరకు ఉన్న తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నర్సరీల్లో కోటి మొక్కల పెంపకం చేపట్టాయి . ఇందుకు గాను రూ.5కోట్లు వెచ్చిస్తున్నాయి. జూలై రెండో వారం నుంచి గిరి రైతులకు మొక్కల పంపిణీకి కార్యాచరణ రూపొందించాయి.

- తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్‌కు జూలై నుంచి పంపిణీ
- ఆగస్టు నుంచి మొక్కలు నాటే పనులు
- గిరి రైతుల ఆదాయం పెంచేలా కార్యాచరణ
- ఏర్పాట్లు చేస్తున్న కేంద్ర కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏ


రైతులకు పంపిణీ చేసేందుకు ఏర్పాటుచేసిన కాఫీ నర్సరీలు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గిరిజన రైతులకు సిరులు కురిపిస్తున్న కాఫీ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తున్నాయి. ఆర్థికంగా అన్ని విధాలుగా ఆదుకుంటున్న కాఫీతోటలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర కాఫీబోర్డు, పాడేరు ఐటీడీఏలు ప్రత్యేక దృష్టి సారించాయి. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఏటా ఫలసాయం ఇస్తున్నాయి. అయితే వీటిలో చాలాచోట్ల చీడపీడలు కారణంగా దిగుబడి తగ్గగా కొన్నిచోట్ల ఎండిపోయాయి. అలాంటి వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు గత ఐదేళ్ల నుంచి కొత్తగా నాటిన కాఫీ తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ పేరిట కొత్తగా మొక్కలు నాటే కార్యక్రమానికి కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏలు శ్రీకారం చుట్టాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 42వేల ఎకరాల కాఫీతోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ చేసేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగానే సుమారు పది వేల ఎకరాల పాత కాఫీతోటల్లో కొత్తగా మొక్కల పునరుద్ధరణ, గత ఐదేళ్లలో వేసిన 32 వేల ఎకరాల కాఫీ తోటల్లో గ్యాప్ ఫిల్లింగ్ పనులు చేపడుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి పాడేరు ఐటీడీఏ పరిధిలోని పలు చోట్ల 25 నర్సరీలను ఏర్పాటుచేశాయి. వీటిలో కోటి కాఫీ మొక్కల పెంపకం చేపట్టారు. ఒకొక్క మొక్క ఉత్పత్తి, రైతులకు చేరవేసేందుకు సుమారు రూ.5 ఖర్చు కాగా కోటి మొక్కలకుగాను రూ.5కోట్లు వెచ్చిస్తున్నాయి. ఈ నిధులను కాఫీ బోర్డు, పాడేరు ఐటీడీఏ భరిస్తాయి. ఎకరాకు 225 మొక్కలు పంపిణీ చేస్తామని కాఫీ ప్రాజెక్ట్ అధికారులు చెబుతున్నారు. జూలై రెండో వారం నుంచి మొక్కల పంపిణీ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు మొదటి వారం నుంచి మొక్కలు నాటే పనులు ప్రారంభమవుతాయి.

రైతులకు సాంకేతిక సహకారం



కాఫీ రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తాం. ప్లాంటేషన్ పనులు ఆగస్టు నుంచి మొదలవుతాయి. మొక్కలు నాటుకునే విధానంపై గిరి రైతులకు అవసరమైన మెళకువలు తెలియజేస్తారు. సస్యరక్షణ, సమగ్ర యాజమాన్యం చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారు.

– అశోక్, కాఫీ ఏడీ, పాడేరు ఐటీడీఏ

ఇండియన్ బ్యాంక్
సీతమ్మధార బ్రాంచ్
డోర్ నెం.50-96-8/5, మొదటి అంతస్తు, ఫ్లాట్ నెం.ఎమ్ఐజి-23, సీతమ్మధార, ఎస్ఐ లే అవుట్, విశాఖపట్నం - 530013. ఫోన్. 0891-2723300

(Appendix IV) స్వాధీనత ప్రకటన
రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **ఇండియన్ బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్స్ 8 మరియు 9 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: నివాస చిరునామా: శ్రీ బురుమూరి సురేష్ కుమార్,** తండ్రి : అప్పారావు, టిఎఫ్-2, 3వ ఫ్లోర్, డి.నెం.7-153/1/12, విజయ రెసిడెన్సీ, మధురవాడ, విశాఖపట్నం - 530013. **సహ-ఋణగ్రహీత: నివాస చిరునామా: శ్రీమతి బి. కాంతి చరణ,** భర్త : సురేష్ కుమార్, టిఎఫ్-2, 3వ ఫ్లోర్, డి.నెం.7-153/1/12, విజయ రెసిడెన్సీ, మధురవాడ, విశాఖపట్నం - 530013. వారు చెల్లించవలసిన బకాయి **హోమ్‌లోన్ అకౌంట్‌నకు రూ.8,78,593/-** (ఎనిమిది లక్షల డెబ్బై ఎనిమిది వేల ఐదు వందల తొంభై మూడు రూపాయలు మాత్రమే) నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.12-02-2024న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూల్సు 8 మరియు 9 ప్రకారము **తేది.23-05-2024**న దిగువ పేర్కొన్న ఆస్తిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి **తేది.22.05.2024** నాటికి **రూ.8,82,275/-** (అక్షరాల ఎనిమిది లక్షల ఎనభై రెండు వేల రెండు వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) + **తేది.23-05-2024** నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు **ఇండియన్ బ్యాంక్** వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు
శ్రీ బి. సురేష్ కుమార్ మరియు శ్రీమతి బి. కాంతి చరణ గార్ల పేరున గల ఆస్తి: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరియు మధురవాడ రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్, మధురవాడ గ్రామం, సర్వే నెం.199/12, పంచాయితీ ఆమోదం పొందిన లే అవుట్ యొక్క ప్లాట్ నెం.5 లోని 433 చ॥గ॥లు లేదా 361.988 చ॥మీ॥ల మొత్తం విస్తీర్ణంలో 30 చ॥గ॥లు లేదా 25.08 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణంలో నిర్మించిన "విజయ్ రెసిడెన్సీ" మూడవ అంతస్తు నందు 730 చ॥అ॥ల బిల్టప్ ఏరియా (కామన్ ఏరియాలతో సహా), అసెస్మెంట్ నెం.100008/83005, డోర్ నెం.7-153/2/12తో గల ఫ్లాట్ నెం.టిఎఫ్-2 యావత్తు ఆస్తి. **మొత్తం అపార్ట్‌మెంట్‌కు హద్దులు : ఉత్తరం :** గెడ్డ, **తూర్పు :** 24 అ॥ల వెడల్పు రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం.6, **దక్షిణం :** ప్లాట్ నెం.లు 10 మరియు 11. **మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం.టిఎఫ్-2కు హద్దులు : ఉత్తరం :** ఓపెన్ టెర్రాస్, **తూర్పు :** మెట్లు మరియు కామన్ కారిడార్, **పడమర:** ఓపెన్ స్పేస్, **దక్షిణం :** ఓపెన్ స్పేస్.

తేది : 23-05-2024
ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి
ఇండియన్ బ్యాంక్